# అమరావతి కథలు

సత్యం శంకరమంచి



## మహారుద్రాభిషేకం

స్నానమాడు తండ్రీ!

కన్నీళ్ళు కాగావు, కష్టాల్లో వేగావు. ఎండల్లో మండావు వొళ్ళు ఉడికిపోయింది. కళ్ళు కవిలిపోయాయి. సంతతధారగా తలార నీళ్ళోసుకుని చల్లబడు తండ్రీ! చల్లబడి, ముందుకు చూడు నా తండ్రీ!

హరహర మహాదేవ!

నరహర మహాదేవ!

అల్లా! ఆ నల్లకొండల్లోంచి పరుగు పరుగున వచ్చిందయ్యా కృష్ణమ్మా! నెమలి పింఛపు చాయ చీర చుట్టాబెట్టి, పాల కొంగల చాయ పట్టురైకా కట్టి, లోయలో జాలుగా జారుజడ వేసికొని, కొండ పువ్వొడి తేనె వొడిలోన వొంపుకుని, కోన పక్షుల రవము కొంగులో కప్పుకుని, వాగుల్లవంకల్ల రాసుకుంటూ, దూసుకుంటూ గట్టుపుట్టల మీంచి గబగబా దూకుతూ అందెల్లు ఘల్లుమన, మట్టెల్లు ఝల్లుమన, ఝణఝణా, ఫెళఫెళా, గలగలా, సరసరా, ఉరకలతో పరుగులతో తరలి వచ్చిందయ్యా కృష్ణమ్మ. ఆ వొడ్డు ఈ వొడ్డు అంతనీ తాకుతూ అమ్మతల్లిలా అలల చేతులు అన్ని వైపులా విప్పుతూ పిలుస్తోందయ్యా కృష్ణమ్మ!

స్నానమాడు తండ్రీ!

శాంతించు తండ్రీ!

ఓ హరుడా!

ఓ నరుడా!

అన్ని పుణ్య నదులకు ఆత్మలా వచ్చిందయ్యా వాహిని.

రాత్రి ఏమి నిద్రపోయావో! ఏ చెడ్డ కల వచ్చిందో! గతమెంత జీర్ణమయిందో! లే తండ్రీ! లే! లేచి స్నానమాడు.

కాళ్ళు కడుక్కునే నీళ్ళు, దాహమార్పే నీళ్ళు, వొళ్ళు నిమిరే నీళ్ళు, చల్లబరిచే నీళ్ళు, దోసిళ్ళపట్టి అక్షయంగా తెచ్చానయ్యా! లే!

అప్పుడే కృష్ణ వొడ్డున ఆడంగులు స్నానాలు చేస్తున్నారు. మొగవాళ్ళు లోతుకి వెళ్ళి ఈతలు కొడ్తున్నారు. పిల్లలు కోసురాళ్ళ పొంచి ఎగిరెగిరి దూకుతున్నారు. కొత్తగా కాపురానికొచ్చిన వైదేహి ఇంకా రాలేదు. 'అత్తగారు కృష్ణకొచ్చి అరగంట దాటిందే! వైదేహి ఇంకా రాలేదేమా!' అని ఎదురుచూస్తున్న రాధకి గబగబా తొట్రుపడుతూ వస్తున్న వైదేహి కన్పించింది. వైదేహి సరాసరి నిలువు లోతులో స్నానం చేస్తూన్న రాధ దగ్గర కెళ్ళింది.

"ఇంతాలస్యం అయిందేం?" అంది రాధ.

"ఇంటి పని" అంది వైదేహి.

రాధ సూటిగా వైదేహి ముఖంలోకి చూసింది. అమ్మ దొంగ దొరికిపోయింది.

"మీ అత్తగారు బయటకొచ్చాక మీ ఆయన ఇప్పటిదాకా ఉండి ఇప్పుడేకదూ పొలం వెళ్ళాడు" అంది రాధ.

వైదేహి తెల్లబోయి సిగ్గుతో ముకుళించుకుపోయింది.

"కొత్త పెళ్ళికూతురివి సరేగాని, నీ ముఖంమీద తోకచుక్కలా చెరిగిపోయిన బొట్టు అసలు కథంతా చెప్పేస్తోంది" అంది రాధ.

సిగ్గు పట్టలేక బుడుంగున నీళ్ళలో మునిగింది రాధ. నీళ్ళ అడుగున ఎంత సిగ్గుతో ముడుచుకుపోయిందో, ఎంత ముసి ముసి నవ్వులు నవ్వుకుందో ఆ కృష్ణమ్మకే తెలియాలి.

వందలమంది ముత్తయిదువులు, మొగవాళ్ళు స్నానాలు చేసి శుభ్రగాత్రులయి ఎవరి పనులకు వాళ్ళు వెళుతున్నారు. నువ్వూ తనివితీరా తలారా స్నానం చెయ్యి తండ్రీ! చేయవలసిన పని చేతుల నిండా ఉంది.

పరుచుకుంటున్న సూర్యకిరణాల్లా లోకంలో నవ్వులు విన్పిస్తున్నాయి. పొద్దున్నే ఇసకలో ఆడుకుంటున్న పిల్లలు, ఇసక చిట్టి గుప్పిట్లతో పట్టి ఒకరిమీద ఒకరు విసురుకుంటూ కిలకిలా నవ్వుతున్నారు. ఇసకలో ఒకరొన్నొకరు కింద పడవేసుకుంటూ ప్రపంచాన్ని జయించిన వీరుల్లా పొంగి పొంగి నవ్వుతున్నారు. వాళ్ళని చూసి అప్పుడే విచ్చిన పువ్వులు నవ్వుతున్నాయి. ఆ పక్క శ్రీదేవి తులసికోట దగ్గర కూర్చుని తనలో తనే మురిసిపోయి నవ్వుకుంటోంది. కాపురానికొచ్చి పదేళ్ళయినా కడుపు పండలేదు. అత్తమామల సాధింపులయ్యాయి. ఆడబిడ్డల ఈసడింపులయ్యాయి—నిన్ననే....నిన్ననే తెలిసింది తను తల్లి కాబోతున్నట్టు. అత్త మెచ్చుకుంది. ఆడబిడ్డ అలంకారాలు చేసింది. ఇక భర్త సరే సరి. శ్రీదేవి కడుపు నిమురుకుంటూ, పుట్టబోయే బిడ్డని తలుచుకుంటూ ముసిముసిగా తృప్తిగా నవ్వుకుంది. తులసి దళాలు గాలికి ఊగిపోయాయి.



అన్నదమ్ములూ, తోడికోడళ్ళూ పెద్ద పండగ జరుపుకొంటున్నట్లు ఆ వరండాలో ఒకటే నవ్వులు. ఆ రెండు కుటుంబాలు విడిపోయి పదేళ్ళయింది. వాళ్ళమధ్య మాటల్లేవు. పిలుపు లంతకన్నాలేవు. ఒక రక్తం పంచుకున్నవాళ్ళు బద్ధ శత్రువు లయిపోయారు. అన్న ఇంట్లో శుభకార్యం పదేళ్ళ ఇనుపతెరని ముక్కలు ముక్కలు చేసింది.

'వాడు పిలుస్తే వస్తా'నన్నాడుతమ్ముడు.

"దానికేం పిలుస్తా" నన్నాడు అన్న. పిలిచాడు. వచ్చాడు. కలిసిపోయారు. పదేళ్ళ కబుర్లన్నీ ఒక్క రోజులోనే చెప్పుకోవాలని కాబోలు ఒకటే మాటలు. వాళ్ళ అయ్యకాలం జ్ఞాపకం తెచ్చుకున్నారు. కలిసి మెలిసి ఒకళ్ళ ముద్ద ఒకళ్ళు అందుకుంటున్నట్టు వరస నవ్వులు.

దీపావళి పండుగనాడు రాముడు తారాజువ్వలు కాలుస్తుంటే విశాలమైన ఛాతివైపు, పొడవాటి చేతులవైపు ఆశగా తలుపు చాటునించి చూస్తున్నది ప్రమీల. అలా చూస్తున్న ప్రమీలని తనూ చూడాలని ఉన్నట్టుండి చిచ్చుబుడ్డి వెలిగిస్తే ఆ వెలుగులో తనకోసం వెలిగించిన దీప కాంతిలో పట్టుచీర కొంగు చాటు నుంచి ప్రమీల నవ్విన నవ్వు.... ఆ నవ్వుకో సమేగా రాముడు మర్నాడే పెళ్ళి ముహూర్తం నిశ్చయించమని తొందర బెట్టింది!

లక్ష్మి సంక్రాంతికి గొబ్బెమ్మలు పెడ్తూ పాట ఆఖరి చరణం "మొగలీ పూవంటి మొగుణివ్వావే" అనంగానే, చెలులు చెప్పకుండా వాళ్ళ బావని తీసికొచ్చి అక్కడ నుంచోపెడ్తే లక్ష్మి పళ్ళెం అక్కడే వొదిలేసి, చెంగున గెంతటమూ, తీసిన పరుగూ చూడవలసిందే. ఇంట్లోకెళ్ళి ఆయాసంతో చెయ్యి గుండెమీదవేసుకుని సిగ్గుతో నవ్వుకున్న ఆ నవ్వో!

ఆ నవ్వులన్నీ కోసుకొచ్చానయ్యా!

ఇటు నవ్వులు అటు కన్నీళ్ళు!

సంతలో గొడ్లమ్మబోయిన కొడుకు రౌడీ తగాదాల్లో ఇరుక్కోగా డబ్బు దోచుకుని కొడుకుని హతమార్చి కాలవలో పారేశారని విన్న క్షణంనించి సూరమ్మ కన్నీటికి అడ్డం వున్నదా? ఏ ఓదార్పు ఆ తల్లికి తిరిగి కొడుకు నివ్వగలదు?

లంకకు గొడ్లు తోలుకుపోయిన భర్త వరద ముంపుకు బలైపోగా బొట్టు మీద బొట్టు మెత్తుకున్నదేగాని ఆ ఇల్లాలు చూపు లంకలమీంచి తిప్పిందా? కళ్ళు ధారలవటం మానాయా?

తాత తండ్రులు కట్టిన ఇల్లు, పెళ్ళి పేరంటాలు జరిగిన ఇల్లు, పాప లుయ్యాలలూగిన ఇల్లు, అప్పుకింద తాకట్టైపోగా ఇల్లు విడిచిపోతున్న పంతులుగారు ఇంటి బయటకొచ్చి ఒక్కసారి ఇంటివైపు చూసినప్పుడు జారిన అశ్రుకణమో! మళ్ళీ ఆ గడపకి పసుపు రాసుకునే యోగ్యత లేదని పంతులుగారి భార్య గడపకి పసుపు రాసి బొట్టుపెట్టి మొక్కుతున్నప్పుడు ఆమె కన్నీటికి చెదిరిన కుంకుమ రేఖలో....

ఏటి కేడాదీ భార్య, పిల్లలతోసహా ఆ పొలంలో పనిచేసి, రక్తం ధారపోసి పంటలు పండిస్తే, ఉన్నట్టుండి ఒక్కరాత్రి పంటంతా తుపాను మింగేస్తే, గట్టునున్న రైతులం తల్లీ! ఇదేనా నాయం! పిల్ల పెళ్ళి చేద్దామనుకున్నానే! ఇంటిదానికి కడియాలు కొందామనుకున్నానే! పెళ్ళీలేదు కడియాలులేవు. ఆఖరికి అన్నం కూడా లేకుండా చేశావా అమ్మా" అంటుంటే ఆ రైతు కళ్ళంట రాలిన కన్నీళ్ళకు భూమి బద్దలవదో!

ఆ నవ్వుల్నీ, ఆ కన్నీళ్ళని కలబోసి తెచ్చాను తండ్రీ!

ఆ నవ్వులు నీవు విన్నవే

ఆ కన్నీళ్ళు నీవు చూసినవే

ఆ రెంటినీ కలిపి నా రెండు చేతులా నీకర్పిద్దామని వచ్చానయ్యా! తెచ్చానయ్యా నూటొక్క బిందె వాసెనగట్టి! మోసుకుంటూ వచ్చానయ్యా దూర దూరాలనించి! అగాధాలు తవ్వి, అంతరంగాలు తొలచి స్వచ్ఛంగా నాగుండె పంటగా సమకూర్చానయ్యా!

లే తండ్రీ! లే!

తలార తనివి తీర స్నానమాడు!

స్నానమాడి

శాంతించు నరుడా!

దీవించు హరుడా!

హరహర మహాదేవ!

నరహర మహాదేవ!

★

# మంగళం

వారం వారం "ఆంధ్రజ్యోతి" పాఠకుల్ని తెలుగు కథ ఎగరలేని ఎత్తులకు జేరవేస్తూ, ఆనందామృత పారావారంలో ముంచెత్తిస్తూ, తెలుగు సంస్కృతికి, తెలుగు సంప్రదాయ జీవితానికి, అద్దం పడుతూ, ఒక మహా ప్రవాహంలా సాగిన "అమరావతి కథల" శీర్షిక ఈ వారంతో, యింతటితో ముగుస్తున్నది.

20–12–74 సంచికలో "వరద" కథతో ప్రారంభమయిన "అమరావతి కథలు" ఈ సంచికలో "మహారుద్రాభిషేకం"తో నూరు కథల నూరు వారాల నోము పూర్తిచేసుకుని, శంకరమంచి సత్యంగారిని కృతార్థుల్ని, పాఠకులను మమ్మ చరితార్థుల్ని చేసింది.

—ఎడిటర్



"ప్రేమలేఖలు"లో జయసుధ, మురళీమోహన్, ఇ!